10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

ఆదివారం | 15 డిసెంబర్ 2024 | పేజీలు 8




వంటశాలలో కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్..



గౌరవ వందనంతో ఆహ్వానిస్తున్న హాస్టల్ విద్యార్థులు..



గౌతమ్ పోట్రు.. మేడ్చల్ జిల్లా కలెక్టర్..

# నాణ్యమైన పౌష్టికాహారంతో... తల్లిదండ్రులకు భరోసా

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్..

- ఘట్కేసర్ మండలం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు ముఖ్య అతిథిగా కలెక్టర్..
- విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయం..
- ప్రభుత్వంపై నమ్మకంతో తమ పిల్లలను దశాబ్దాలుగా ఇక్కడే విద్య, భద్రత కల్పిస్తారని భావించేలా భరోసా.
- కొత్త మెనూ అమలు, పిల్లలతో పాటు తల్లిదండ్రులకు శనివారం ప్రత్యేకంగా లంచ్ ఏర్పాటు చేశారు..
- హైజిన్ పౌష్టికాహారం, యూనిఫామ్ షూస్, సాక్సులు, కాస్మెటిక్ చార్జీలు కూడా అందించబోతున్నాం..
- ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో.. దశాబ్దాలుగా మార్పులేని మెస్ చార్జీలను ప్రస్తుతం 40 శాతం పెంపు..

-2లో



అధికారులతో వంటకాలు పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్

# సీఎం రేవంత్ రెడ్డిని తన వివాహానికి ఆహ్వానించిన పీవీ సింధు



- జుబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిసిన పీవీ సింధు
- ఆహ్వాన పత్రికను అందించిన పీవీ సింధు
- ఈ నెల 22న రాజస్థాన్‌లో పీవీ సింధు వివాహం

హైదరాబాద్ పెన్ పవర్:భారత ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తన పెళ్లికి ఆహ్వానించారు. ఆమె తన తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లోని జుబ్లిహిల్స్‌లో గల ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆహ్వాన పత్రికను సీఎంకు అందించారు. సీఎం... ఆమెకు శాలువా కప్పి సన్మానించారు.పీవీ సింధు వివాహం ఈ నెల 22న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో జరగనుంది. పీవీ సింధుకు కాబోయే వరుడి పేరు వెంకటదత్తసాయి. ఈరోజు ఎంగేజ్‌మెంట్ జరిగింది. తమ ఎంగేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫొటోను ఆమె సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. ఒకరి ప్రేమ దక్కిన సమయంలో మనం తిరిగి ప్రేమించాలి అనే కాప్షన్‌తో ఈ పోస్ట్ చేశారు.

# బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులు.. ఏడాదిలోనే చేశాం

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలోని పేద పిల్లలకు మెరుగైన విద్య అందించబోతున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 2024, డిసెంబర్ 14న మంత్రి శ్రీధర్ బాబు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు.. గత ప్రభుత్వం లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఒక్క ఎకరాకు సాగు నీరు ఇవ్వలేదని మండిపడ్డారు.

-3లో



# నాణ్యమైన పౌష్టికాహారంతో.. తల్లిదండ్రులకు భరోసా..



వసతి గృహంలో విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం..






**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 14:** విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు..! తల్లిదండ్రులకు ఈ సొసైటీలపై మరింత నమ్మకాన్ని పెంపొందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు.. ఘట్కేసర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా శనివారం రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సంబరాల కార్యక్రమానికి కలెక్టర్ గౌతమ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌తో గౌరవ వందనం చేసి కలెక్టర్‌ను ఆహ్వానించారు.. కార్యక్రమంలో ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించారు.. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో తమ పిల్లలను దశాబ్దాలుగా ఇక్కడ ఉంచి వారికి విద్య భద్రత కల్పిస్తారని భావించేలా భరోసా ఇస్తున్నామని కలెక్టర్ అన్నారు..

## రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్‌లలో ఈ పౌష్టికాహారం..

ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన మెనూతో పిల్లలతో పాటు తల్లిదండ్రులకు ప్రత్యేక లంచ్ ఏర్పాటు చేశారు.. రాష్ట్రస్థాయిలో అన్ని వసతి గృహాలలో ఒకే రకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో శ్రీకారం చుట్టిందని కలెక్టర్ అన్నారు..ఇకపై అన్ని వసతి గృహాలలో ఇదే మెనూ అమలు అవుతుందని అన్నారు.. ముందుగా ఈ వసతి గృహంలోనే కలెక్టర్ తరగతి గదులను, వంటశాలను, స్టోర్ రూమ్‌ను పరిశీలించి సంబంధిత వివరాలను స్కూల్ ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.. విద్యార్థులు ఆటపాటలతో అతిథులందరిని అలరించారు.. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ఘట్కేసర్ తహసిల్దార్, స్కూల్ యాజమాన్యం విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు..

## వంటశాల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ..

నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు వంట వారికి ప్రత్యేక శిక్షణను ఇప్పించడం, హైజీన్ నిర్వహణ ఎలా చేయాలో నేర్పించడం, ఆహారం రుచికరంగా ఎలా వండాలో కూడా నేర్పిస్తారని కలెక్టర్ అన్నారు.. విద్యార్థులకు నాణ్యమైన చదువు, భద్రతతో పాటు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించి వారి ఆరోగ్యం పట్ల బాధ్యత వహిస్తారని, తల్లిదండ్రులు గ్రహించేలా ఫ్యాకల్టీ శ్రద్ధ వహించాలన్నారు.. విద్యార్థులు ఇప్పటివరకు ఏం తింటున్నారో పేరెంట్స్ గమనించి ఉంటారని.. కొత్త మెనూ అంతకంటే బాగుంటుందని పేర్కొన్నారు.. నూతన మెనూ తూచా తప్పకుండా పాటిస్తామని భరోసా కల్పించారు..నేటి నుండి పెరిగిన కాస్మోటిక్ చార్జీలను విద్యార్థులకు అందజేస్తామని ఫ్యాకల్టీ వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు..

ఇకపై విద్యార్థులకు హైజిన్ పౌష్టికాహారం యూనిఫామ్ షూస్, సాక్సులు, కాస్మెటిక్ చార్జీలు కూడా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.. ముఖ్యంగా తల్లిదండ్రులు గ్రహించాలన్నారు.. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో, దశాబ్దాలుగా నిలకడగా ఉన్న మెస్ చార్జీలను 40 శాతానికి పెంచడంతో పాటు..! నేటి నుండి విద్యార్థులకు మెనూ చాట్‌లో నిర్ణయించిన ప్రకారమే పౌష్టికాహారాన్ని అందించాలని..! విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫ్యాకల్టీకి కలెక్టర్ సూచించారు..



హాస్టల్‌లో విద్యార్థుల బెడ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్..



కలెక్టర్ గౌతమ్ సహపంక్తి భోజనం..

# అట్ల ఎట్లా స్టేట్‌మెంట్ ఇస్తడు.. మెట్రో సీఎఫ్‌వోను లోపలేయుమన్న: సీఎం రేవంత్

- ఆయనది పొలిటికల్ మోటివేటెడ్ స్టేట్ మెంట్
- హైదరాబాద్ లో మెట్రో ఉన్నది 69 కిలోమీటర్లే
- మహిళలకు ఉచిత బస్సు రాష్ట్రమంతా ఉన్నది
- ఫ్రీ బస్సు వల్ల మెట్రో రైల్ కు నష్టమెలా వస్తది
- రాజకీయ పార్టీతో కుమ్మక్కయి కాంగ్రెస్ సర్కారును బద్నాం చేస్తుండు
- అజెండా ఆజ్ తక్ 2024 లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**'మెట్రో సీఎఫ్‌వోను లోపలేయు మన్న.. ఆయన పొలిటికల్ మోటివేటెడ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు.. అంతలోనే ఆయన ముంబై పారిపోయిండు.. హైదరాబాద్‌లో మెట్రో లైన్ ఉన్నది కేవలం 69 కిలోమీటర్లు.. మేం మహిళలకు ఫ్రీ బస్ రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తున్నం. ఉచిత బస్సు కారణంగా మెట్రో నష్టాల పాలవుతుందని ఎట్లా స్టేట్‌మెంట్ ఇస్తడు...? హైదరాబాద్‌లో ఎంత మంది మహిళలు మెట్రో వదిలి ఫ్రీ బస్సు ఎక్కుతున్నారు.. మీరు హైదరాబాద్ రండి చూపిస్తా.. అది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే స్టేట్‌మెంట్..' అని తనదైన శైలిలో స్పందించారు సీఎం రేవంత్ రెడ్డి. నిన్న రాత్రి ఢిల్లీలో జరిగిన అజెండా ఆజ్ తక్%-%2024 కాంక్లేవ్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు సౌకర్యంపై అడిగిన ప్రశ్నకు ఘాటుగా సమాధానం చెప్పారు.

### మెట్రో సీఎఫ్‌వో ఏమన్నారంటే..?

ఈ ఏడాది మే నెలలో ఓ బిజినెస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎల్ అండ్ టీ సీఎఫ్ వో ఆర్ శంకర్ రామన్ మాట్లాడారు. బిజినెస్ ప్లాన్ లో భాగంగా హైదరాబాద్ మెట్రో వాటాలను అమ్మేయనున్నట్టు చెప్పారు. రోజుకు ఐదు లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఫ్రీ బస్ జర్నీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీంతో మెట్రో నిర్వహణ భారంగా మారిందని ఎల్ అండ్ టీ సంస్థ చెబుతోంది. వాస్తవాలను పరిశీలిస్తే ఫ్రీ బస్ తర్వాత కేవలం రోజుకు 20 వేల మంది ప్రయాణికులు మాత్రమే తగ్గారు. దీనిపై అప్పుడే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామనే సాకుతో మెట్రో నిర్వహణను వదులుకుంటామంటే వేరొకరికి అప్పగిస్తామని చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యం విషయంలో వెనక్కు తగ్గేది లేదని కుండబద్దలు కొట్టారు. వాస్తవానికి మెట్రో సర్వీసుల్లో నిలుచునేందుకు కూడా జాగా ఉండటం లేదన్నది అందరికీ తెలిసిందే.

గత ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందిన ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో నిర్వహణ నుంచి తప్పుకొనేందుకు ప్రయత్నిస్తుండటంపై అనేక విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు అంశం తెరమీదకు వచ్చింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కుంగిపోవడం, వాటిపై జ్యుడీషియల్ ఎంక్వైరీ మొదలు కావడంతో సర్కారును బ్లాక్ మెయిల్ చేసేందుకే ఎల్ అండ్ టీ అలాంటి స్టేట్ మెంట్ ఇచ్చిందనే చర్చ కూడా జరిగింది.

### దిగివచ్చిన ఎల్ అండ్ టీ

హైదరాబాద్ మెట్రో స్టేట్ మెంట్ సీఎఫ్ వో చేసిన వ్యాఖ్యలు పెను దుమారమే రేపాయి. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి అదే స్థాయిలో రియాక్ట్ అవడంతో ఆ కంపెనీ యాజమాన్యం దిగివచ్చిందని తమ తప్పును ఒప్పుకుందని సీఎం ఆజ్ తక్ కాంక్లేవ్ లో చెప్పారు. తమ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ తప్పుడు స్టేట్ మెంట్ ఇచ్చారని ఒప్పుకున్నారని తెలిపారు. ఆ తర్వాత రెండో దశ పనులు మొదలయ్యాయి. రెండో దశలో 116.4 కిలోమీటర్ల మేర కొత్త మెట్రో లైన్ కు సంబంధించిన ప్రక్రియ మొదలైంది.

# త్వరలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి






**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల విద్యార్థులు చదివే హాస్టల్స్‌ను బలోపేతం చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం (డిసెంబర్ 14) సికింద్రాబాద్ మహీంద్రా హిల్స్‌లోని రెసిడెన్షియల్ హాస్టల్లో కామన్ మెనూ డైట్ ఛార్జ్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులకు అందించే ఫుడ్ వివరాలు అడిగి తెలుసుకున్న ఉత్తమ్.. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో పాటు వారికి వడ్డించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. మీతో కొంత సమయం గడపడం నాకు ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. హాస్టల్లో ఇన్వర్టర్, ల్యాబ్ రూమ్స్ , వింటర్ హిటర్ కావాలని అడిగారని.. వాటి కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో 16 ఏళ్ళ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల మంది విద్యార్థులకు ఈ పెంచిన చార్జీలు వర్తిస్తాయన్నారు. విద్యార్థుల కోసం ప్రతి ఏడాది రూ.470 కోట్లు ఖర్చు చేయబోతున్నామని పేర్కొన్నారు. త్వరలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని తెలిపారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగకుండా ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకుంటుందని చెప్పారు.

## బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులు.. ఏడాదిలోనే చేశాం

- మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులు మేం ఏడాదిలోనే చేశామని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో పారిశ్రామిక పార్క్ కు శంకుస్థాపన చేశామన్నారు. భూపాలపల్లిలో 4 లైన్స్ రోడ్డు నిర్మాణం చేస్తామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు మంత్రి శ్రీధర్ బాబు.

## ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం: కవిత

**చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ఉండాలన్న కవిత**

**ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు కొనసాగిస్తామని వెల్లడి**

**రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదని మండిపాటు**




**హైదరాబాద్ పెన్ పవర్:**తాము ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఒక చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవాన్ని చాటేలా పద్యాలు, కవితలు రచించి పుస్తకాలుగా విడుదల చేస్తామన్నారు. ఉద్యమ సమయం తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేసుకుంటూ వెళతామన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదని, అందుకే విగ్రహం రూపాన్ని మార్చారని ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుంటే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని... జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## లింగంపల్లి నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి పుష్పక్ బస్సులు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర రోడ్డు మరియు రవాణా సంస్థ (%ట+రా=ఆ%) లింగంపల్లి నుండి హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి పుష్పక్ బస్సు సర్వీసులను ప్రారంభించనుంది. ఆదివారం (డిసెంబర్ 15) నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. లింగంపల్లి నుండి హైదరాబాద్ విమానాశ్రయానికి పుష్పక్ బస్సు సేవలు ఉదయం 5:45 గంటలకు ప్రారంభమైతే, చివరి బస్సు రాత్రి 8:45 గంటలకు బయలుదేరుతుంది. అదే సమయంలో విమానాశ్రయం నుండి మొదటి బస్సు ఉదయం 7:30 గంటలకు, చివరి సర్వీస్ రాత్రి 10:30 గంటలకు బయలుదేరుతుంది. బస్సులు ఆల్విన్ ఎక్స్ రోడ్, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల మీదుగా నడుస్తాయి. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్ కుమార్ తెలిపారు.

## చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫోటోలకు పాలాభిషేకం

**హైదరాబాద్ పెన్ పవర్:**మంచిర్యాల జిల్లా భీమారం మండలంలో నేషనల్ హైవే %-%63 రహదారిలో కొత్తగా బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఫోటోలకు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాలాభిషేకం నిర్వహించారు. కొత్త బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.1.80కోట్ల మంజూరు చేసి, కేవలం 10 రోజుల్లోనే 4 కి.మీ దూరం బీటీ రోడ్డు నిర్మాణపనులు కంప్లీట్ చేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. బీటీ రోడ్డు నిర్మాణం పట్ల ప్రయాణికులు, వాహనదారులు ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట.. ఇంకా వెంటిలేటర్ పైనే శ్రీతేజ్

**హైదరాబాద్ పెన్ పవర్:**సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడ్డ బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై కిమ్స్ వైద్యులు హెల్త్ బులిటెన్ రిలీజ్ చేశారు శ్రీతేజ్ పీఐసీయూలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు. అతడికి అడపాదడపా జ్వరం వస్తుందని చెప్పారు డాక్టర్లు. శ్రీ తేజ్ 11 రోజులుగా శ్రీ తేజ్ కిమ్స్ దవాఖానాలో మృత్యువుతో పోరాడుతున్నారు. మరో వైపు ఎప్పుడు స్పృహలోకి వస్తాడోనని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఇన్ని రోజులవుతున్నా కండ్లు తెరిచి చూడకపోవడంతో తండ్రి భాస్కర్ ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్ 4న రాత్రి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్ లోని సంధ్య థియేటర్ లో పుష్ప 2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాటలో రేవతి అనే మహిళ (35) చనిపోగా.. ఆమె కొడుకు శ్రీతేజ్ కు గాయాలైన సంగతి తెలిసిందే.

ఈ తొక్కిసలాట కేసులో ఇప్పటికే సంధ్య థియేటర్ ఓనర్ తో పాటు అల్లు అర్జున్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో అల్లు అర్జున్ జైలు నుంచి రిలీజ్ అయ్యాడు. చనిపోయిన మహిళ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని.. రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తామని అల్లు అర్జున్ ప్రకటించాడు.

# అల్లు అర్జున్‌పై మాకు ఎలాంటి కక్ష లేదు.. మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా?: టీపీసీసీ చీఫ్ ప్రశ్న

- చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న మహేశ్ కుమార్ గౌడ్
- ఏ నటుడిపై కాంగ్రెస్ పార్టీకి కోపం లేదన్న టీపీసీసీ చీఫ్
- బీజేపీ నేతలు తమకు ఆపాదిస్తున్నారన్న మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ పెన్ పవర్:**సినీ నటుడు అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కక్ష లేదని, అయినా ఆయన కారణంగా ఓ మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా? అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులే కారణమన్నారు.తొక్కిసలాట కారణంగా ఓ పేద మహిళ చనిపోతే చర్యలు తీసుకోవద్దా? అన్నారు. అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగినప్పటికీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చట్ట ప్రకారమే అల్లు అర్జున్‌పై కేసు పెట్టారని, అరెస్ట్ చేశారని, ఆ తర్వాత కోర్టు బెయిల్ (మధ్యంతర) కూడా ఇచ్చిందన్నారు. ఏ నటుడిపై కూడా కాంగ్రెస్ పార్టీకి కోపం లేదన్నారు. తమకు సినిమా వారి పట్ల ప్రేమే ఉందన్నారు. సినిమా తారలపై కేసులు అన్నీ చట్టం పరిధిలోనివే అన్నారు. అల్లు అర్జున్‌పై పెట్టిన కేసును కాంగ్రెస్ పార్టీకి ఆపాదించవద్దని కోరారు. దీనిని అధికార పార్టీకి ఆపాదించే ప్రయత్నం తెలంగాణ బీజేపీ నేతలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

# ఆకాశమంత లక్నవరం చూసొద్దామా.. హైదరాబాద్ నుంచి ఇలా వెళ్లాలి.. ఇవి చూడాలి..!



**హైదరాబాద్ పెన్ పవర్:**చుట్టూ కొండలు.. మధ్యలో నీరు.. వేలాడే వంతెన... అన్నీ కలబోసి గగనతలం నుంచి తీసిన ఈ సిత్రాలు భలే ఉన్నాయి కదా! ఈ దృశ్యాలను చూసి ఏ ఐలాండో, ఏ మలేషియా అనుకుంటే పొరపడినట్లే. ఇది ఎక్కడో కాదు.. మన తెలంగాణలోనే, జయశంకర్ జిల్లా గోవిందరావుపేట మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరొందిన లక్నవరం సరస్సు...

వరంగల్ జిల్లా కేంద్రానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. 202 జాతీయ రహదారికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడికి ప్రత్యేక బస్సు సర్వీసులు లేవు. ప్రైవేటు రవాణాలో వెళ్లాల్సిందే.. ఆర్టీసీ బస్సుల్లో, సొంత వాహనాల్లో వచ్చేవాళ్లు... ములుగు డివిజన్ కేంద్రం దాటిన తర్వాత గోవిందరావు పేట మండలంలోని చల్వాయి గ్రామం వద్దగల బుస్సాపూర్ క్రాస్ నుంచి కుడివైపుకు ఎనిమిది. కిలోమీటర్ దూరం ప్రయాణిస్తే లక్నవరం చేరుకోవచ్చు.

### మరో వేలాడే వంతెన

లక్నవరం సరస్సుకు వెళ్తే మనసు దోచే ఎన్నో అందాలు ఆకట్టుకుంటాయి. నూట అరవై మీటర్ల పొడవు ఉన్న వేలాడేవంతెనపై పర్యాటకులు ప్రకృతి బందాలను ఆస్వాదిస్తూ తన్మయత్వం పొందుతారు. అలలపై పయనించేందుకు బోటింగ్, భోజన వసతి కోసం రెస్టారెంట్, విశ్రాంతి కోసం కాటేజీలు ఉన్నాయి. కొత్తగా మరో వేలాడే వంతెన కూడా టూరిజం అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. దాంతో రోజు రోజుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది..

ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్న ఈ సరస్సు తెలంగాణలోనే ప్రధాన పర్యాటక కేంద్రంగా పేరు తెచ్చుకుంది. ఇక్కడి పరిసరాలు, సరస్సు, మధ్యలోని దీవులు పర్యాటకానికి అనువుగా ఉండటంతో పర్యాటక శాఖ అదనపు హంగులు అద్దింది. మొదట ఈ సరస్సుపై హరిద్వార్ తరహాలో రాష్ట్రంలో మొట్టమొదటి వేలాడే వంతెనను నిర్మించారు.

కాకతీయుల శిల్ప కళా సందడను తిలకించేందుకు వీలుగా దీనిని రూపొందించారు. సరస్సులో ఆరు దీవులను ఆరు రణాలగా ముస్తాబు పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లు చేసింది. సెలవు దినాల్లోనే కాకుండా, మిగతా రోజుల్లో ప్రాంతానికి చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు.

### చారిత్రక ఆనవాళ్లు

కాకతీయులు చెరువులు నిర్మించిన ప్రతిచోట ఆలయ నిర్మాణాలు చేపట్టినట్లు చరిత్ర చెబుతోంది. కానీ లక్నవరం, పాకాల సరస్సులను మాత్రం వ్యవసాయ కేంద్రాలుగానే భావించినట్లు తెలుస్తోంది. లక్నవరం దగ్గర ఉన్న బుస్సాపూర్ గ్రామంలో అడవుల్లో చిన్న చిన్న గుడులు కట్టారు. రామలింగేశ్వరుడిని ప్రతిష్టించిన అనవాళ్లు ఇక్కడ కనిపిస్తాయి. పాడి పంటలు బాగా పండాలని కాకతీయులుఈ నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# నిన్న టెకీ అతుల్ సుభాష్..ఇవాళ హెడ్ కానిస్టేబుల్.. పెళ్లాం వేధింపులతో 33 ఏళ్ల పోలీస్ ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:**సేమ్ టు సేమ్..అదే వేధింపులు..అవే కేసులు..అదే టార్చర్..నిత్యం నరకం.. డ్యూటీ చేసుకునే పరిస్థితి లేదు.. మనశ్వాంతిగా నిద్రపోయిన రోజులు లేవు.. రోజుల తరబడి అదే ఆందోళన.. చివరి ప్రాణాలు తీశాయి. నిన్న యూపీ అతుల్ సుభాష్ కు ..ఇవాళ బెంగళూర్ లో హెడ్ కానిస్టేబుల్.భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులకు బెంగళూరు టెకీ సూసైడ్ ఘటన మరవకముందే అదే ప్రాంతంలో మరో దారుణ ఘటన.. భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులకు మానసికంగా కుంగిపోయిన బలవంతంగా ప్రాణాలు తీసుకున్నాడు బెంగళూరు కు చెందిన హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న అలుగూరు. వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. ఛిద్రమైన తిప్పన్న శరీర భాగాలతో పాటు అక్కడో సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకోవడం.. తిప్పన్న అలుగురు భార్య టార్చర్ విషయాలు బయటికొచ్చాయి. శుక్రవారం ( డిసెంబర్ 13) రాత్రి బైయప్పనహల్లి రైల్వే స్టేషన్ సమీపంలో వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు తిప్పన్న అలుగూరు.. శనివారం ఉదయం ట్రాక్ పై ఛిద్రమైన ఉన్న తిప్పన్న అలుగురు శరీరభాగాలతో పాటు డెత్ నోట్ కూడా స్వాధీనం చేసుకున్నారు రైల్వే పోలీసులు. తిప్పన్న అలుగూరు తన డెత్ నోట్ లో తాను టార్చర్, బాధను వివరించాడు. గత




కొంతకాలంగా తన భార్య, ఆమె తండ్రి,తల్లి వేధిస్తున్నారని ఆరోపించాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలతో గొడవలు జరుగుతుండగా.. శుక్రవారం రాత్రి మరింత ముదిరాయి. భార్యతో గొడవపడ్డ విషయాన్ని భార్య తండ్రికి చెప్పగా.. అతను కూడా దుర్భాషలాడినట్లు తిప్పన అలుగురిరు సూసైడ్ నోట్ లో రాసుకున్నాడు.

"నువ్వు చనిపో.. నువ్వు లేకుండా నా కూతురు బాగుపడుతుంది.. సంతోషంగా బతుకుతుంది అని" తిప్పన మామ ఫోన్లో దుర్భాషలాడడంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డెత్ లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తిప్పన అలుగురు కర్ణాటకలోని విజయపుర జిల్లా సింధగి సమీపంలోని హండిగనూరుకు చెందినవాడు. హులిమావు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బెంగళూరులోని హీలాలిగే రైల్వే స్టేషన్, కార్మిలారం హుసగూరు రైల్వే గేట్ మధ్య వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. డ్యూటీలో ఉండగానే ఆత్మహత్య కు పాల్పడ్డాడు. తిప్పన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సీవీ రామన్ ఆస్పత్రికి తరలించారు. తిప్పన ఆత్మహత్య చేసుకోవడంతో అతని పేరెంట్స్ ఆందోళనకు దిగారు. తన కుమారుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తిప్పన్న పేరెంట్స్ కంప్లయింట్ మేరకు నిందితులు అయిన అతని భార్యపై 108, 351(3), 352 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు పోలీసులు.

# మీడియాను నేనే లోపలికి తీసుకెళ్లా.. మంచు మనోజ్

## రిపోర్టర్ పై దాడి ఘటనపై వివరణ ఇచ్చిన నటుడు
## మీడియా ప్రతినిధుల తప్పేమీ లేదని వెల్లడి
## లోపలికి వెళ్లాక సడెన్ గా వచ్చి దాడి చేశారన్న మనోజ్



**హైదరాబాద్ పెన్ పవర్:**జల్ పల్లిలోని మంచు మోహన్ బాబు ఫాంహౌస్ లో ఇటీవల మీడియా ప్రతినిధులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. నటుడు మోహన్ బాబు ఓ మీడియా ప్రతినిధి చేతుల్లో నుంచి మైక్ లాక్కుని దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెటిజన్లు దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మీడియా ప్రతినిధులదే తప్పని కొంతమంది కామెంట్లు పెడుతుండగా.. మరికొందరు మోహన్ బాబును తప్పుబడుతున్నారు. తాజాగా ఈ ఘటనపై మంచు మనోజ్ స్పందించారు. ఫాంహౌస్ లోపలికి దూసుకు రావడంతో మీడియా ప్రతినిధులపై దాడి జరిగిందన్న ప్రచారాన్ని కొట్టిపారేశారు.

ఈ ఇష్యూలో మీడియా ప్రతినిధుల తప్పేమీలేదని, తానే వారిని లోపలికి తీసుకెళ్లానని స్పష్టతనిచ్చారు. తన ఏడు నెలల కూతురును తెచ్చుకోవడానికి ఫాంహౌస్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారని చెప్పారు. గేట్లు మూసేసి తనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని వివరించారు. దీంతో తాను గేట్లు పగలకొట్టి మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని లోపలికి వెళ్లానని చెప్పారు. ఇంతలో సడెన్ గా తన తండ్రి, ఇతరులు వచ్చి తమపై దాడి చేశారని చెప్పారు. ఈ క్రమంలోనే ఓ రిపోర్టర్ కు తీవ్ర గాయాలయ్యాయని మనోజ్ వివరించారు.

# ఈ స్టూడెంట్ పాటకు సీఎం రేవంత్ రెడ్డి ఫిదా..



**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా చిలుకూరులో సీఎం కార్యక్రమంలో ఓ విద్యార్థి పాడిన పాట అందరిని ఆకట్టుకుంది. సర్కారు స్కూళ్లు, చదువు ప్రాధాన్యతను వివరిస్తూ పాట పాడాడు స్టూడెంట్. విద్యార్థి పాడిన పాటకు అక్కడున్న వారంతా ఫిదా అయ్యారు. చప్పట్టు కొట్టి అభినందించార సీఎం రేవంత్.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా చిల్కూరు రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల విద్యార్థులకు అత్యున్నతమైన మెనూ అందిస్తున్నామని సీఎం అన్నారు. నెలలో ఒక్కో వారానికి ఒక్కో మెనూ చొప్పున రెండు సార్లు చికెన్, రెండు సార్లు మటన్ ఇస్తున్నట్లు తెలిపారు. గురుకులాల్లో గత 16 ఏళ్లుగా కాస్మొటిక్ ఛార్జీలు పెంచలేదని, తమ ప్రభుత్వం 200 శాతం పెంచిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెస్ ఛార్జీలను 40 శాతం పెంచామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత భారీగా ఛార్జీలు పెంచడం ఇదే మొదటి సారి అని గుర్తు చేశారు.

# గ్రూప్-2 అభ్యర్థులకు గుడ్ న్యూస్.. టీజీఎస్ ఆర్టీసీ స్పెషల్ బస్సులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల (డిసెంబర్) 15, 16వ తేదీల్లో గ్రూప్- 2 పరీక్షలు జరగన్నాయి. గ్రూప్-2 పరీక్షలకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో గ్రూప్-2 అభ్యర్థులకు టీజీఎస్ ఆర్టీసీ కీలక సూచన చేసింది. ఎగ్జామ్ నేపథ్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్2 ఎగ్జామ్‌కు వెళ్ళే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది ఆర్టీసీ.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఎగ్జామ్ సెంటర్లకు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేసినట్లు గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెల్లడించారు. గ్రూప్ 2 పరీక్ష జరగనున్న15, 16 రెండు రోజుల పాటు స్పెషల్ సర్వీస్ ఎగ్జామ్స్ సెంటర్స్ వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. పరీక్ష ప్రారంభ సమయానికి ముందు.. పరీక్ష ముగిసిన తర్వాత సమయాల్లో ఈ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్టాప్‌ల దగ్గర హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని.. అభ్యర్థులను సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ ల్లో సూపర్ వైజర్లు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. స్పెషల్ బస్ సర్వీసుల వివరాలు తెలుసుకునేందుకు కోఠి, రైతిఫల్ బస్టాండ్ లో కమ్యూనికేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రూప్ 2 అభ్యర్థులు ఈ స్పెషల్ బస్ సర్వీసులకు ఉపయోగించుకోవాలని కోరారు.

## పిల్లల్లో అధిక బరువు చాలా డేంజర్.. జాగ్రత్తగా ఉండండి పేరంట్స్..!



**హైదరాబాద్ పెన్ పవర్:**అధిక బరువు వల్ల అన్నీ అనర్థాలే అంటున్నారు వైద్యులు. ఇది పెద్దవాళ్లకే కాదు, చిన్న పిల్లలకూ వర్తిస్తుంది. ఈ మధ్య చిన్నా రులు కూడా అధిక బరువుతో బాధపడుతున్నారు. ఆహారం మీద నియంత్రణ లేకపోవటం, వేళకు తినకపోవడం, ఎక్కువ బయట ఫుడ్స్ తినడం వల్ల బరువు పెరుగుతున్నారని నిపుణులు చెప్తున్నారు. కానీ ఈ మధ్యకాలం లో అమెరికాలోని పరిశోధకులు ఎక్కువ బరువున్న పిల్లల గురించి పరిశోధన చేశారు. సుమారు అయిదు వేల మందిని ఈ పరిశోధనకు ఎన్నుకున్నారు. అయితే సాధారణ బరువు ఉన్న పిల్లలు 60శాతం మందైతే, మిగిలిన 40 శాతం మంది ఎక్కువ బరువు ఉన్న వాళ్లను ఈ అధ్యయనానికి ఎంచుకున్నారు. వారమో.నెలో కాకుండా ఎక్కువకాలం పరిశీలించారు. చివరకు అధ్యయనకారులు అధికబరువు వల్ల చిన్నారులకు ఆస్తమా వచ్చే అకాశాలు ఎక్కువని తేల్చారు. అంటే, అధిక బరువు 23 శాతం మందికి ఆస్తమా వచ్చిందని చెప్పారు. కానీ అధిక బరువు వల్ల మాత్రమే వీళ్లకు ఆస్తమా వచ్చిందా లేక జీన్స్ ప్రభావం వల్ల వచ్చిందా అన్నది మాత్రం కచ్చితంగా చెప్పలేదు.. కానీ నేటితరం తల్లిదండ్రులు పిల్లలు తినే ఆహారం మీద దృష్టి పెట్టకపోతే వాళ్లు ఎక్కువ బరువుతో పాటు అనేక ఇతర రోగాల పల్ల కూడా ఇబ్బంది పడతారు అన్నది మాత్రం నిజమని పరిశోధకులు చెబుతున్నారు.


## గుకేశ్‌కు ఎలాన్ మస్క్ కంగ్రాట్స్!

**18 ఏళ్లకే వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్**

**చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్ షిప్ కైవసం**

**దీంతో మనోడిపై సర్వాత్ర ప్రశంసలు**

**గుకేశ్‌కు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపిన మస్క్**




**హైదరాబాద్ పెన్ పవర్:**భారత యువ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ గా అవతరించాడు. 18 ఏళ్లకే ఇలా వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచాడు. తద్వారా ఈ ప్రతిష్మాత్మక టైటిల్‌ను గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన (18ఏళ్ల 8నెలల 14రోజులు) ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. దీంతో మనోడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. తాజాగా టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత, అపర కుబేరుడు ఎలాన్ మస్క్ కూడా గుకేశ్‌కు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కంగ్రాట్స్ చెబుతూ మస్క్ స్పెషల్ పోస్ట్ పెట్టారు. ఇప్పుడీ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మీ గుండె బాగుండాలంటే.. ఈ ఫ్రూట్స్ తీసుకోండి.. గుండెపోటు తప్పించుకోండి..!

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రతిరోజు పరగడుపున అరకప్పు బొప్పాయి ముక్కల్ని తీసుకుంటే బరువు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు యాపిల్ కూడా తీసుకుంటే మరింత ఆరోగ్యం చేకూరుతుందని చెబుతున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో అరటిపండు తినడం కూడా మంచిది. అరటిలోని కెరోటినిన్ అనే పదార్థం మానసిక రుగ్మతలను దూరం చేస్తుంది. అరటిపండు.. బొప్పాయి.. యాపిల్ తినడం వలన గుండె ఆరోగ్యానికి ఎలాంటి డోకా ఉండదు. అలాగే చేపలు తినడం ద్వారా ఒమేగా 3 ఫ్యాట్స్ లభిస్తాయి. ఇవి గుండెపోటును అరికడతాయి. శరీరానికి కావాల్సిన నీటిని, పీచు పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు.




గుండెకు అవసరమయ్యే ఫైబర్, విటమిన్స్.. మినరల్స్ గోధుమల్లో పుష్కలంగా లభిస్తాయి. ఇది గుండెకు హాని కలిగించే కొవ్వును నివారిస్తుంది. ఫైబర్ కొవ్వుతో కలిసి దానిని బయటికి పంపించి వేస్తుంది.. ఇంకా ఫైబర్ దొరికే పదార్థాలలో ఓట్స్, బార్లీ, రాగి, జొన్నలాంటివి ముఖ్యమైనవి. ముఖ్యంగా అధిక కొవ్వు తగ్గించడంలో ఉల్లిపాయలు మంచి మందుగా పనిచేస్తాయి. అందుకే ఉల్లిపాయలు రోజువారీ ఆహారంలో ఉండేలా చూడాలి.

# అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం నన్ను బాధించింది: కాంగ్రెస్ నేత దానం నాగేందర్

**అల్లు అర్జున్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడం సంతోషకరమన్న దానం**

**తన నటన ద్వారా తెలుగు రాష్ట్రాలకు గుర్తింపు తెచ్చాడని కితాబు**

**అల్లు అర్జున్ అరెస్ట్ దురదృష్టకరమని వ్యాఖ్య**




**హైదరాబాద్ పెన్ పవర్:**సినీ నటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం తనను కొంత బాధించిందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత దానం నాగేందర్ అన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. హైకోర్టులో మధ్యంతర బెయిల్ లభించడంతో అతను విడుదలయ్యారు. ఈ ఘటనపై దానం నాగేందర్ స్పందించారు. అల్లు అర్జున్ పాన్-ఇండియా హీరో మాత్రమే కాదని, ప్రపంచ హీరో అన్నారు. ఆయన తమకు బంధువు కూడా అవుతారని తెలిపారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం పట్ల విచారం వ్యక్తం చేసినట్లు చెప్పారు. మొత్తానికి అతనికి కోర్టు బెయిల్ ఇవ్వడం మాత్రం చాలా సంతోషకరమైన విషయమన్నారు. అల్లు అర్జున్ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు గుర్తింపు తెచ్చారన్నారు. ఆయన సినిమాలను ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్నట్లు మీడియా ద్వారా తెలిసిందని, ఏదేమైనా అల్లు అర్జున్ అరెస్ట్ కావడం దురదృష్టకరమైన సంఘటనగా భావిస్తున్నానన్నారు.

# అల్లు అర్జున్ అరెస్ట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫైర్




హైదరాబాద్ పెన్ పవర్:పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కేసులో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడాన్ని విపక్ష బీఆర్ఎస్ తప్పుబడుతున్న విషయం తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్ నిన్న (శుక్రవారం) అరెస్టును ఖండించారు. ఇవాళ (శనివారం) తాజాగా ఆ పార్టీ హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కూడా స్పందించారు. అల్లు అర్జున్ చేసిన తప్పేమిటని, ఆయనను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోర్టు బెయిల్ ఆర్డర్ కాపీ ఇచ్చిన తర్వాత కూడా రాత్రంతా జైలులోనే అల్లు అర్జున్‌ను ఉంచాల్సిన అవసరం ఏముందని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. సంధ్య థియేటర్ ఘటనలో అరెస్ట్ చేయాల్సింది అల్లు అర్జున్‌ను కాదని, సీఎం రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయాలని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన హుజురాబాద్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కారుపై ఈ సందర్భంగా ఆయన విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే అగ్నిగుండమే**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రమంతా అగ్నిగుండంగా మారుతుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే కాంగ్రెస్ నాయకులను రాష్ట్రంలో తిరగనివ్వబోమని వార్నింగ్ ఇచ్చారు. ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం 'టెస్లా' కంపెనీని హైదరాబాద్‌కి తీసుకురావాలనే ఉద్దేశంతోనే నగరానికి ఫార్ములా రేస్‌ను కేటీఆర్ తీసుకొచ్చారని, దానిని రద్దు చేసిన రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు!

- పరీక్షల తేదీలపై అధికారుల కసరత్తు
- దాదాపు ఖరారైనట్లేనని అధికారుల వెల్లడి
- అధికారికంగా ప్రకటన వెలువడడమే తరువాయని వివరణ



హైదరాబాద్ పెన్ పవర్:ఇంటర్ పరీక్షల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని, షెడ్యూల్ ఖరారు చేసే అంశం తుది దశలో ఉందని అధికార వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ దాదాపుగా ఖరారైందని వివరించాయి. వచ్చే వారంలో అధికారికంగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అనధికారిక సమాచారం ప్రకారం.. మార్చిలో పరీక్షలు నిర్వహించాలని, ఆ నెలాఖరులోగా అన్ని పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.దీనికి అనుగుణంగా మార్చి 3వ తేదీ నుంచే ఇంటర్ పరీక్షలు ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇంటర్ అన్ని గ్రూపులకు చెందిన పరీక్షలు నిర్వహించేందుకు దాదాపు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. నెలాఖరులోగా పరీక్షలు పూర్తిచేయాలంటే మార్చి 3న పరీక్షలు ప్రారంభించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఇక, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఫిబ్రవరిలో పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షల ఫీజు గడువు డిసెంబర్ 3 తో ముగియగా ఆలస్య రుసుముతో జనవరి 2 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డ్ కల్పించింది. రూ.2 వేల ఆలస్య రుసుముతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 9 నుంచి 10 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతారని ఇంటర్ బోర్డ్ అధికారులు తెలిపారు. దీనికి తగ్గట్లు రాష్ట్రంలో పరీక్షలకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

## ఆ ఘటన పూర్తిగా యాక్సిడెంటల్.. బాధిత ఫ్యామిలీకి అండగా ఉంటాం:



హైదరాబాద్ పెన్ పవర్:సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన యాక్సిడెంటల్‌గా జరిగిందని ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్ చెప్పారు. బాధిత కుటుంబానికి మరోసారి క్షమాపణలు చెప్పడంతో పాటు వారికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. గడిచిన 20 ఏళ్లలో 30 సార్లు అదే థియేటర్‌కి వెళ్లి సినిమా చూశానని, ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదన్నారు. ఒకరు చనిపోవడం దురదృష్టకరం అని, దానికి తాను చింతిస్తున్నానన్నారు. అనుకోకుండా జరిగిన ఈ ఘటనలో తన ప్రమేయం ఏమీ లేదన్నారు. కుటుంబంతో కలిసి తాను థియేటర్‌లో సినిమా చూస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తానన్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది కనుక దీనిపై మాట్లాడలేనని బన్నీ అన్నారు. ఇక అరెస్ట్ సమయంలో తనకు అండగా నిలిచిన అభిమానులు, మీడియాకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అటు తన అరెస్టు వెనక కుట్ర ఉందన్న ప్రచారంపై బన్నీ స్పందించలేదు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కామెంట్లపైనా కూడా ఆయన సమాధానం ఇవ్వకుండా చిరునవ్వుతో వెళ్లిపోయారు.

## విద్యార్థులను మేం ఎవరెస్ట్ ఎక్కించాం.. వాళ్లు ఆసుపత్రి మెట్లు ఎక్కించారు.. ప్రభుత్వంపై కేటీఆర్ సెటైర్



హైదరాబాద్ పెన్ పవర్:గురుకులాల విద్యార్థులను తమ హయాంలో ఎవరెస్ట్ ఎక్కించి రికార్డులు సృష్టించేలా చేశామని, రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం విద్యార్థులను ఆసుపత్రి మెట్లు ఎక్కించిందని కేటీఆర్ ట్విట్టర్ లో మండిపడ్డారు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభంగా మార్చేశారని విమర్శించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడంలేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల ఆవేదనపై బీఆర్ఎస్ కల్పించుకుని గురుకులాల బాట పట్టడంతో ఎట్టకేలకు ప్రభుత్వంలో చలనం వచ్చిందని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సామాన్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో భయాందోళనలు నింపిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. పాఠాలు చెప్పే చోట పాము కాట్లతో పసిబిడ్డల ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు.. అన్నట్లు పాలకులు ఇప్పుడు గురుకులాలను సందర్శించడం మొదలుపెట్టారని చెప్పారు. నామమాత్రంగా సందర్శించి, ఫొటోలు దిగి రాకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెమెరాల ముందు హడావుడి చేయడంతో సరిపెట్టకుండా గురుకులాల బిడ్డల గుండె చప్పుడు వినాలని, గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి కేటీఆర్ హితవు పలికారు.

## బన్నీని కలిసిన సుకుమార్, విజయ్ దేవరకొండ

**హైదరాబాద్ పెన్ పవర్:**జైలు నుంచి విడుదలై ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్తో డైరెక్టర్ సుకుమార్, హీరో విజయ్ దేవరకొండ భేటీ అయ్యారు. పుష్ప-2 నిర్మాతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేసుకు సంబంధించిన విషయాలపై వీరు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే డైరెక్టర్ వంశీ పైడిపల్లి, ఆనంద్ దేవరకొండ బన్నీని కలిశారు.

## గురుకుల పాఠశాలలో కొత్త డైట్ మెనూను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్ పెన్ పవర్:**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం నాడు మధిర నియోజకవర్గం బోనకల్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించారు. అయనకు జిల్లా అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం కు బ్యాండ్ మేళాలు, వాయిద్యాలు వాయిస్తూ, పూలు చల్లుతూ స్వాగతం పలికారను. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా రూపొందించిన కొత్త డైట్ మెనూ ను అయన ప్రారంభించారు.

## హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ నేత వి ప్రకాష్ ఆరోపించారు. ఈ దుష్టలక్ష్య సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లిని కూడా వదిలిపెట్టలేదు. జూన్ 2న తెలంగాణ తల్లి విగ్రహాలకు పూజలు చేసే కార్యక్రమం చేపట్టుకుందాం. చేతి గుర్తు కోసం తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చేశారు. సచివాలయంలోపల తెలంగాణ తల్లిని బందీ చేశారు. ప్రభుత్వం ఎన్ని జీవోలు తెచ్చినా, కేసులు పెట్టినా ఉద్యమ తెలంగాణ కోసమే మా పోరాటమని అన్నారు.

## తెలంగాణ తల్లి ఒక ప్రతిమ కాదు... సాంస్కృతిక వైభవానికి ప్రతీక

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ తల్లి ఒక ప్రతిమ కాదు. సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. శనివారం జరిగిన తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో అయన మాట్లాడారు. ఉద్యమానికి స్ఫూర్తి ఉండేలా కేసీఆర్ తెలంగాణ తల్లిని తయారుచేయించారు. చరిత్ర నిర్మాణం, ఉద్యమాలు, గత వైభవాలపై అవగాహన లేకుండా సీఎం రేవంత్ రెడ్డి చరిత్రను చరిపేస్తున్నారు. బతుకమ్మ అంటే బతుకుజీవుడా అని కాదు... అది మహిళా శక్తికి ప్రతీక. తెలంగాణ అంటే బతుకమ్మ అనే విధంగా ఉన్న బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి తీసేశారు. తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప పేరు తేకున్నా పర్వాలేదు కానీ ఉన్న వైభవాన్ని తొలగించవద్దు. తెలంగాణ సంస్కృతిని కాపాడానికి ఎమ్మెల్సీ కవిత మరో పోరాటాన్ని ప్రారంభించాలి. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి ఎమ్మెల్సీ కవిత నాయకత్వం వహించాలని అన్నారు.

# ట్రంప్ మరో సంచలన నిర్ణయం.. డే లైట్ సేవింగ్ టైమ్ కు స్వస్తి?

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా తదుపరి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు అసౌకర్యంగా మారిన డే లైట్ సేవింగ్ టైమ్ ను రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. డే లైట్ సేవింగ్ టైమ్ వల్ల అమెరికన్లపై చాలా భారం పడుతోందని ఆరోపించారు. రిపబ్లికన్ ప్రభుత్వం ఇలాంటి వాటిని సరిచేసి ప్రజలకు మరింత సౌకర్యవంతమైన పాలన అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తాను ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన వెంటనే ఈ నిర్ణయం అమలు చేయడానికి ప్రయత్నిస్తానని వివరించారు. దీంతో ఏటా రెండుసార్లు టైమ్ ను సరిచేసుకునే ఇబ్బంది నుంచి ప్రజలకు విముక్తి కలుగుతుందని, దేశంపై ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ట్రంప్ వివరించారు.




**డే లైట్ సేవింగ్ టైమ్ అంటే..**

అమెరికా సంయుక్త రాష్ట్రాల విస్తీర్ణం చాలా ఎక్కువనే విషయం తెలిసిందే. యూఎస్ఏలోని కొన్ని ప్రాంతాలు వివిధ టైమ్ జోన్ లలో ఉన్నాయి. ఈ క్రమంలోనే పగటిపూట సమయాన్ని ఆదా చేసే ఉద్దేశంతో తీసుకొచ్చిందే 'డే లైట్ సేవింగ్ టైమ్'(డీఎస్ టీ). దీని ప్రకారం.. మార్చిలో పగటి పూట వెలుతురు ఎక్కువగా ఉన్నపుడు గడియారాన్ని ఒక గంట ముందుకు జరుపుతారు. తిరిగి నవంబర్ లో ఒక గంట వెనక్కి జరుపుతారు. దీని ఉద్దేశం పగటి సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడమే. ఏటా మార్చి రెండవ ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గడియారాన్ని గంట ముందుకు తిప్పి 3 గంటలు చూపించేలా మార్చుతారు. తిరిగి నవంబర్ మొదటి ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గడియారాన్ని 1 గంట చూపించేలా మార్చేస్తారు.

# ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం

**మాజీ మంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్ పెన్ పవర్:**నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థిని లలావతిని మాజీ మంత్రి హరీష్ రావు, మండలిలో ప్రతిపక్ష నేత ఎల్వోపీ మధుసూదన్ చారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శనివారం పరామర్శించారు.హరీష్ రావు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్ లో ఉంచి వారికి చికిత్స అందించారు. నాలుగు రోజులు గడించింది. అయినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదు. విద్యార్థిని లీలావతిని నిమ్స్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి..మౌనంగా ఇలా నిమ్స్ ఆసుపత్రి బెడ్ పై ఉండటం చూస్తే మనస్సు కలిచివేస్తున్నదని అన్నారు.ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నది. వాంకిడి గురుకుల విద్యార్థులకు




చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నది. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు.రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి. గురుకులల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు. విద్యా మంత్రి, ఎస్సీ, ఎస్టీ మంత్రి కూడా రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం వుంది. చూడడానికి వెళ్తే ప్రతి పక్ష నాయకులను అడ్డుకుంటారు. సబితా ఇంద్రా రెడ్డి, , సత్యవతి ని అరెస్టు చేశారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడం పై ఉన్న ధ్యాస, కనీసం జిల్లాలో ఉన్న పిల్లల భవిష్యత్తు పై లేదా? నిన్న నల్గొండ ? కేతేపల్లి మండలం గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న నీలం సాయి గణేష్ పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రి పాలయ్యాడు. ఫుడ్ పాయిజన్ కేసులు, కుక్క కాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాకులు నిత్య కృత్యం అవుతున్న ప్రభుత్వం ముద్దు నిద్ర వేడడం లేదని అన్నారు.

ఇప్పటి వరకు 49 మంది విద్యార్థులు చనిపోతే ఉలుకు లేదు పలుకు లేదు. ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభ పాఠశాలలుగా మార్చారు. మేము ప్రశ్నిస్తే వార్డెన్లు, ప్రిన్సిపల్స్ మీద చర్యలు తీస్కొని చేతులు దులుపుకుంటున్నారు నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్నరు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడం లేదు. సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదు. ఇప్పటికైనా కళ్లు తెరిచారు స్వాగతిస్తున్నాము. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు .. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫోటోలకు పోజులు ఇవ్వడం కాదు-పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండని అన్నారు,